# మహా జాతర

మన జాతర - మన మేడారం

నమస్తే తెలంగాణ

గురువారం 22 ఫిబ్రవరి 2024 వరంగల్ IV


## జలధారల వద్ద జనం బారులు



ఏటూరునాగారం, ఫిబ్రవరి 21: తల్లి సమ్మక్క ఉన్న చిలుకలగుట్ట సమీపం నుంచి రెండు జల ధారలు వస్తుంటాయి. వాటి నీరు అమృతంలా పనిచేస్తుందనే నమ్మకం భక్తుల్లో ఉంది. చిలుక లగుట్టపైకి వెళ్లే దారిలో జంపన్నవాగుకు మధ్య గుట్ట దిగువన రాళ్ల మధ్య నుంచి రెండు జల ధారలు వస్తుంటాయి. వీటిని సమ్మక్క-సార లమ్మ జలధారలుగా భావిస్తారు. నిత్యం ఒకే తీరుగా వచ్చే ఈ జలధారల వద్ద భక్తులు పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు కొట్టి పూజలు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో విడిది చేసేవారు ఈ నీటిని పట్టుకుని తాగుతుం టారు. గుట్టపై అనేక రకాల వనమూలికల వృక్షాలు ఉన్నాయని, చెట్ల వేర్లను తాకుతూ కిందకు వచ్చే జలం చల్లగా, రుచిగా ఉంటుం దని భక్తుల్లో విశ్వాసం. దీంతో భక్తులు తాగడా నికి, ఇంటికి తీసుకెళ్లడానికి ఈ జలాన్ని బాటిళ్లు, క్యాన్లలో నింపుకుంటారు.



## పగిడిద్దరాజుకు నీరాజనం

గోవిందరావుపేట, ఫిబ్రవరి 21 : మండలంలోని లక్ష్మీపురం నుంచి మేడారానికి బయలుదేరిన పగిడిద్దరా జుకు ఊరూరా భక్తులు నీరాజనం పలికారు. పూనుగుండ్ల నుంచి మంగ ళవారం ఉదయం బయలుదేరిన పగి డిద్దరాజు రాత్రి లక్ష్మీపురానికి చేరు కొని అక్కడే బస చేశారు. బుధవారం ఉదయం గిరిజన సంస్కృతి, సంప్ర దాయాల నడుమ గుడి వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివ సత్తులు, భక్తులతో ఆలయం కిక్కిరిసి పోయింది. అక్కడి నుంచి మొద్దుల గూడెం, టపమంచ, వెంగళాపురం, నార్లాపూర్ మీదుగా మేడారానికి బుధవారం సాయంత్రం పగిడిద్దరాజు చేరుకోగా, గద్దెపై ప్రతిష్ఠించారు. కార్య క్రమంలో పూజారులు పెనుక ఇద్దయ్య, కృష్ణయ్య, సమ్మయ్య, సమ్మక్క, సారయ్య, విజయలక్ష్మి, సత్యనారాయణ, లక్ష్మయ్య, నరేశ్, రవి, సంతోష్‌తో పాటు పెనుక వంశీ యులు పాల్గొన్నారు.



## ఒళ్లంత తుళ్లింత..

మేడారం జాతరకు కుటుంబంతో వచ్చిన ఓ బాలుడు అమ్మవార్లకు తలనీలాలు సమర్పించాడు. జంపన్నవాగు ఒడ్డున షవర్ల కింద ఇలా జలకాలాడాడు. నీటి జల్లుల్లో శరీరాన్ని తడుముకుంటూ 'ఒళ్లంత తుళ్లింత కావాలి లే' అని పాడుకుంటున్నట్లుగా ఉన్న అతడు 'నమస్తే' కెమెరాలో బంది అయ్యాడు.



## ప్రత్యేక ఆకర్షణగా రంగులరాట్నాలు

వాజేడు, ఫిబ్రవరి 21: మేడారం మహాజాతరలో రంగులరాట్నాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు కుటుంబ సమేతంగా రంగుల రాట్నాలు ఎక్కి ఎంజాయ్ చేస్తున్నారు. పిల్లలతో కలిసి భక్తులు సందడి చేస్తున్నారు.

## ప్లాస్టిక్ వద్దు.. సహజం ముద్దు..!

ములుగురూరల్, ఫిబ్రవరి21 : మేడారం జాత రలో పర్యావరణ పరిరక్షణపై తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బుధ వారం భక్తులకు సిబ్బంది అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ టూత్ బ్రష్‌లు, ఇయర్‌బడ్స్, పెన్నులు, గ్లాసులు, ప్లేట్లు, కేక్ కటింగ్ కత్తులతో పాటు ప్లాస్టిక్ వల్ల కలిగే హానికరమైన ప్రభావాలను వివ రించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నా యంగా మట్టి, చెక్క, కాగితం, వెదురుతో తయారు చేసిన సహజ ఉత్పత్తులను వాడాలని సూచిం చారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలని కోరారు.



పర్యావరణంపై స్టాల్ ద్వారా భక్తులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



## పోలీసన్నకు పచ్చబొట్టు..

సమక్క-సారక్క జాతర వేలాది మందికి ఉపాధి కూడా చూపిస్తున్నది. జాతర విధుల్లో తలమునకలైన ఓ పోలీసన్నకు ఇతగాడు ఆధునిక పద్ధతుల్లో పచ్చబొట్టు వేస్తూ 'నమస్తే'కంటపడ్డాడు.





## జంపన్నకు ముడుపులు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 21 : జంపన్నవాగు ఒడ్డున గద్దెపై కొలువైన సమ్మక్క తనయుడు జంపన్నకు పెద్ద సంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లిస్తున్నారు. వాగులో భక్తులు పుణ్యస్నానాలాచరించిన అనంతరం జంపన్నకు కొబ్బరికాయలు కొట్టి, సంతానం కలగాలని ఎర్రగుడ్డలో కొబ్బరి కాయలను చుట్టి చెట్టుకు ముడుపులు కడుతున్నారు.

## జంపన్న వాగు కిటకిట

ఏటూరునాగారం, ఫిబ్రవరి 21 : మేడారం జాతర సందర్భంగా జంపన్నవాగు భక్తులతో కిటకిటలాడింది. ఆనవాయితీ ప్రకారం మొదట జంపన్నవాగుకు చేరుకుని తలనీలాలు సమర్పించి స్నానాలు చేస్తున్నారు. దీంతో సుమారు రెండు కిలోమీటర్ల మేర స్నానఘట్టాలు జనంతో నిండిపోయాయి. ఓ వైపు శివసత్తుల పూనకాలు, మరోవైపు చిన్నారులు వాగులో సరదాగా జలకాలాడుతూ కనిపించారు. ముందుజాగ్రత్తగా మత్స్యశాఖ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లను నియమించి భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా సెక్టోరల్ అధికారులు, పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.



